www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 23 ఆగస్టు 2024

5

తిరుపతి



ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



ప్రజాశక్తి- తిరుమల: కాకినాడకు చెందిన ప్రసన్న కోట విరూపా పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం రాత్రి శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1,00,01,116లు విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును దాత తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమలలోఅదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు.

చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలి

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు సిపిఎం రాష్ట్ర నేత మూలం రమేష్ మద్దతు

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న మూలం రమేష్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: టీటీడీ పరిపాలనా భవనం ఎదుట శ్రీవారి మెట్టు వ్యాపారులు వారి కుటుంబాలతో సహా నిరసన దీక్ష నిర్వహించారు. శ్రీవారి మెట్టు మార్గంలో వ్యాపారాలు చేసుకోవటానికి అనుమతి ఇవ్వాలని, దాడులు జరగకుండా చట్టబద్ధం చేయాలని కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం ఎదురుగా దీక్షను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ వ్యాపారులకు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారని హామీ ఇచ్చారు. టీటీడీ యాజమాన్యం సాంకేతిక కారణాలు చూపి వ్యాపారాలను అడ్డుకుంటున్నదని, ఇది మంచిది కాదు అన్నారు. పేదలకు రాజకీయాలు అంటగట్టి ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని గతంలో వైసిపి, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలు వారు వ్యాపారస్తుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, న్యాయం చేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం ధర్మం కాదని ఆయన అన్నారు. టీటీడీ ఈవో స్పందించి తక్షణమే సమస్య పరిష్కారానికి పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన దీక్షకు చిట్టిబాబు అధ్యక్షత వహించగా కార్యదర్శి లోకనాథం, యూనియన్ నాయకులు యుగంధర్, చిరంజీవి, నరసింహ, మల్లి, సోనూ, మొగిలప్ప, రాంబాబు, గణేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పండుగ వాతావరణంలో గ్రామసభలు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 23వ తేదీ ఒకే రోజు నిర్వహించే గ్రామ సభలను పండుగ వాతావరణంలో విజయవతంగా నిర్వహించాలని, ప్రతి గ్రామసభకు ఒక ప్రత్యేక అధికారిని నియమించామని, సదరు గ్రామసభలో స్వర్ణ గ్రామంగా తయారవడానికి గ్రామవిజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మండల అధికారులు, ఆర్డీఓలు, మునిసిపల్ కమిషనర్లుతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, ఒక గ్రామం నుండి మరో గ్రామానికి, గ్రామం నుండి మండలాన్ని కలిపే అనుసంధానం చేసే రహదార్లు నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఘణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజల్లో

అవగాహన కల్పించి విజన్ డాక్యుమెంట్ తయారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అందరు ప్రజాప్రతినిధులు ఈ గ్రామసభల్లో పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామసభల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలదేవి, డిప్యూటీ సిఈఓ ఆది శేషారెడ్డి, పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, డిఎంహెచ్ఓ శ్రీహరి, ఆర్డీఓలు నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, రవి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రమాదాలపై

'నేడు సిఐటియు నిరసన'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అనకాపల్లి అచ్యుతాపురం ఎస్ఇజడ్‌లో జరిగిన ఘోర ప్రమాదాన్ని నిరసిస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలకు కారణమవుతున్న యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా శుక్రవారం పారిశ్రామిక కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం ఎస్ఇజడ్ ఫార్మా కంపెనీలో బుధవారం నాటి రాత్రి జరిగిన ఘోర ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో చట్టంలో మార్పులు చేసి యజమానులే తమ భద్రతపై సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చుకోవడం అనే సౌలభ్యం కారణంగా ప్రమాదాలకు కారణమవుతుందని ఆయన ఆరోపించారు. లేబర్ ఇన్స్‌పెక్టర్‌లు, భద్రత అధికారులు వేలు పెట్టడానికి వీలులేని రీతిలో చట్టంలో మార్పు చేయడం దారుణమని అన్నారు. కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదని మరణించిన తర్వాత నష్టపరిహారం ఎంత? అనే దానిపై లెక్కలు వేసుకోవడం అమానవీయమని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట యజమానుల పట్ల అనుసరిస్తున్న ధోరణి సమంజసంగా లేదని, సత్యవేడు శ్రీసిటీ సందర్శన సందర్భంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ తర్వాత స్పీడ్ ఆఫ్ డూయింగ్‌గా మారిందని గొప్పలు చెప్పుకున్నారని వాస్తవంగా పారిశ్రామిక కేంద్రాల్లో దుర్భరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయని, దానికి ప్రత్యక్ష సాక్ష్యం అచ్యుతాపురంలో జరిగిన ఘటనే అన్నారు. శ్రీకాళహస్తి పుష్పిత్ కర్మాగారంలో కూడా బుధవారం నాడు బీహార్‌కు చెందిన కార్మికుడు అనుమానాస్పద రీతిలో మరణించారని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, బీహార్ కార్మికుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో గూడూరు, నాయుడుపేట, సత్యవేడు ప్రాంతాల్లోని పలు పరిశ్రమల్లో ఇలాంటి ఘటనలు జరిగాయని, గత ఘటనల ఆధారంగా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తి ఉండేది కాదని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం యజమాన్యాల పట్ల కఠిన వైఖరి అవలంబించాలని కందారపు మురళి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

శ్రీవారి సేవలో చిరంజీవి, మంత్రి ఆనం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారి మేల్కొలుపు సేవైన సుప్రభాతసేవలో కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి చిరంజీవిని పట్టువస్త్రంతో సత్కరించారు. చిరు జన్మదినం సందర్భంగా స్వామివారిసేవలో పాల్గొనటం విశేషం. ఆలయం వెలుపల వచ్చిన చిరంజీవిని చూసేందుకు భారీస్థాయిలో అభిమానులు ఎగబడ్డారు. ఆయనతో ఫోటోలు దిగేందుకు భక్తులు, అభిమానులు ఆసక్తి చూపారు. గురువారం వేకువజామున సమయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్న వీరికి రంగనాయక మండపంలో ఆలయమర్యాదలతో అర్చకులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని కోరుకున్నానని తెలిపారు. మంత్రి వెంట తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఆనం కైవల్యారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా 'హాట్ స్పాట్' రెస్టారెంట్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

పట్టణంలోని నారద పుష్కరిణి సమీపంలో ఉన్న హైప్స్-వీ మాల్‌కు అనుబంధంగా 'హాట్ స్పాట్' రెస్టారెంట్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కస్టమర్లు, పలువురు అతిథుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి 'హాట్ స్పాట్' రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్సీ, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ప్రముఖ వ్యాపారవేత్త, ఎంజీఎం హాస్పిటల్స్ అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో నగరాలకేమీ తీసిపోకుండా మల్టీ కుషన్ రెస్టారెంట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించడం గొప్ప విషయమని రెస్టారెంట్ అధినేత పెరుమాళ్ రెడ్డిని అభినందించారు. రెస్టారెంట్లో కార్పొరేట్ స్థాయి వసతులున్నా కూడా అన్ని వర్గాల ప్రజల కోసం సామాన్య ధరల్లోనే ఫుడ్‌ను అందించడం శుభ పరిణామం అన్నారు. వెజ్ అండ్ నాన్ వెజ్, అన్ని రకాల చైనీస్ వంటకాలు, టీ, ఐస్ క్రీమ్, కూల్‌డ్రింక్స్ ఒక్క చోటే లభించడం ఈ రెస్టారెంట్ విశేషమన్నారు. రెస్టారెంట్‌కు విచ్చేసే కస్టమర్లకు నాణ్యతపై రాజీ పడకుండా ఫుడ్‌ను అందించాలని యాజమాన్యంకు సూచించారు. రెస్టారెంట్ అధినేత పుదుకుడి పెరుమాళ్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు హరికేష్, సంయుక్తారాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన

ఏఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

పోలీసు శాఖలో క్రమశిక్షణ, జవాబుదారీతనం చాలా ముఖ్యం అది లోపిస్తే కఠిన చర్యలు తప్పవని, విధినిర్వహణలో అలసత్వాన్ని, నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన నేపథ్యంలో సస్పెన్షన్ వేటు తప్పదని ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు అన్నారు. వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ ఇంచార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ షణ్ముఖం ఆదివారం రాత్రి గొడవలు కారణంగా రక్త గాయంతో స్టేషన్‌కి వచ్చిన వ్యక్తిని విచారించి తగు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రవర్తనను సహించేది లేదని ఎస్పీ అన్నారు. జిల్లా పోలీసులు నిర్లక్ష్య ధోరణికి చరమగీతం పాడాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ షణ్ముగం విధినిర్వహణలో బాధితుని నుండి ఫిర్యాదు స్వీకరించి విచారణ జరపకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారని, మానవత్వాన్ని మరిచి తన విధులు నిర్వర్తించడంలో విఫలమయ్యారని అలాగే ఈ విషయాన్ని పై అధికారులకు తెలియకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సదరు ఏఎస్ఐని బుధవారం సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

రూ.50 లక్షల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అక్రమంగా తరలిస్తున్న రూ.50 లక్షల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి రూరల్ సీఐ శాదిక్ ఆలీ తెలిపారు. స్థానిక తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కేరళ రాష్ట్రానికి చెందిన ఓ వాహనం తమను చూసి వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు పకడ్బందీగా ఆ వాహనాన్ని పట్టుకోవడంతో నిందితులు వాహనాన్ని వదిలి పారిపోయారన్నారు. వాహనాన్ని తనిఖీ చేయక అందులో రూ.50 లక్షల విలువ చేసే గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా తరలిస్తున్న గంజాయిని వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించమన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సైలు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ఎలెక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2025

నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎలక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2025 కొరకు బిఎల్ఓలు వారి పరిధిలోని ఇంటింటి గృహ సందర్శన చేసి ఓటర్ వెరిఫికేషన్ చేయాలని సిఈఓ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల డిఆర్ఓలు, ఈఆర్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మార్గదర్శనం చేశారు. గురువారం వెలగపుడి సచివాలయం నుండి అన్ని జిల్లాల డిఆర్ఓ, ఈఆర్ఓలతో ఎస్ఎస్ఆర్ - 2025 పై, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ పెంచల కిషోర్, ఈఆర్ఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అధికారి మాట్లాడుతూ బిఎల్ఓలు ఇంటి ఇంటికీ వెళ్లి గృహ సందర్శన చేసి ఓటర్ల జాబితా పరిశీలించి సదరు వివరాలను ధృవీకరణ చేయాలని జిల్లా డిఆర్ఓ, ఈఆర్ఓలు, ఎఈఆర్ఓలకు సక్రమంగా షెడ్యూల్ మేరకు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎలెక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ -2025లో భాగంగా మార్గదర్శకాల మేరకు పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్తీకరణ /పునర్విభజన చేయాలని, ఎన్నికల జాబితా/ ఎపిక్‌లో ఏదైనా లోపాలను తొలగించాలని, చిత్రనాణ్యత మెరుగుపరచడం, పోలింగ్ స్టేషన్ల, సరిహద్దుల ఖరారు వంటి ప్రాథమిక సవరణ కార్యచరణలు చేపట్టాలని తెలిపారు. హెల్ప్‌లైన్ యాప్ గురించి

వివరించాలని తెలిపారు. ఈఆర్ఓలు సంబంధిత బిఎల్ఓలకు ఓటర్ల జాబితా నమోదు, సవరణపై పూర్తి శిక్షణ ఇవ్వాలని అలాగే ఇంటిలో ఉన్న ప్రతి ఓటుహక్కు కలిగిన వ్యక్తిని వెరిఫికేషన్ చేస్తేనే ఆ ఇల్లు పూర్తిగా వెరిఫికేషన్ చేసినట్టు అవుతుందని, ఆ విధంగా బిఎల్ఓలు వెరిఫికేషన్ చేసేలా సంబంధిత అధికారులు వారికి సూచించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈఆర్ఓలు కోదండరామి రెడ్డి, నిశాంత్‌రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రవి శంకర్‌రెడ్డి, ఎస్డిసి రామ్ మోహన్, పాల్గొన్నారు.

గొల్లవారిపాలెంలో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- వరదయ్యపాళ్యం: శ్రీసిటీ పరిధిలోని గొల్లవారిపాలెం గ్రామంలో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని ఎన్ఎస్ ఇన్స్టుమెంట్స్ ఇండియా పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా గురువారం ప్రారంభించారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థ ఎన్ఎస్ ఇన్స్టుమెంట్స్ ఇండియా, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం ద్వారా రూ.35 లక్షల ఖర్చుతో అంగన్వాడీ భవనాన్ని నిర్మించారు. భవనంతో పాటు మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, ఫర్నిచర్, టివి, ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన భూమిని శ్రీసిటీ విరాళంగా అందచేసింది. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ తకావో ఇకరాషి, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్, సాయి కృష్ణ, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్, సెక్యూరిటీ ప్రతినిధి వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ గ్రామ సర్పంచ్ పార్వతి సన్యాసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజీమే కజోకా మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యావైద్య సంస్థల మౌళిక సదుపాయాలను మెరుగుపరచడంలో సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ చొరవను అభినందించారు. ఈ చొరవ ఇతర పరిశ్రమలకు స్ఫూర్తిదాయకంగా మారి, వారు కూడా ఈ తరహా మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు దోహద పడుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

జూనియర్ వైద్యురాలి హత్య అమానవీయం

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): కలకత్తాలోని ఆర్జీ కార్ వైద్యకళాశాలలో జరిగిన జూనియర్ మహిళా డాక్టరు పాశవిక హత్యను అమానవీయమని 'శ్లోక-ఏ బిర్లా' పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీణావాణి అన్నారు. గురువారం చంద్రగిరి మండలం తొండవాడలోని శ్లోక-ఏ బిర్లా స్కూల్ విద్యార్థులు కొత్తపేట బస్టాండ్ నుండి, చంద్రగిరి క్లాక్ టవర్ వరకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజలను చైతన్య పరిచే సాంఘిక నృత్యాలు, నాటికలతో, కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వీణావాణి మాట్లాడుతూ కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై పాశవికంగా మూకుమ్మడి అత్యాచారం చేసి హత్యకు పాల్పడినట్లు పోస్టుమార్టం రిపోర్టు చెప్తుంటే, ఒకడినే బాధ్యుడిని చేసి కేసు పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ అఘాయిత్యానికి పాల్పడిన ముద్దాయిలను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాలు ఎన్ని ఉన్నా పటిష్టంగా అమలు జరగకపోవడం వల్ల మహిళలపై అత్యాచారాలు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల డైరెక్టర్ శ్రీవత్సవ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంటలో..

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

రేణిగుంట: కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన వారిపై చర్యలు కఠిన చర్యలు తీసుకోవాలని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను మరింత కఠినం చేయాలని ఐద్వా నాయకులు ఎంపిటిసి రాజేశ్వరి డిమాండ్ చేశారు. గురువారం రేణిగుంలో ఐద్వా, ప్రగతి సంస్థ, అంగన్వాడీలతోపాటు బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థినులు ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

తిరుపతి టౌన్: కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ జీవకోనలో మజీద్ ఏ మహమ్మదీయ, ఎకరా ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం సోదర సోదరీమణులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థ 48వ డివిజన్ కార్పొరేటర్ అన్న అనిత యాదవ్, మజీద్ ఏ మహమ్మదీయ ముతవల్లి (ప్రెసిడెంట్) రఫీ హిందుస్తానీ ఎక్కడ ట్రస్ట్ చైర్మన్ అయిషా పర్వీన్ జూనియర్ డాక్టర్ పై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధితులైన వారందరినీ బహిరంగ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ మహిళా కేంద్రం ఆధ్వర్యంలో కోలకతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఉదంతాన్ని నిరసిస్తూ గురువారం విద్యార్థులు, అధ్యాపకులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పద్మనాభం మాట్లాడుతూ బాలికలు మహిళల పట్ల ఇలాంటి అత్యాచార ఘటనలు జరగడం చాలా హేయనీయమన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శ్యామ్మోహన్ డేవిడ్ రాజు, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య మురళీధర్, హోమ్ సైన్స్ అధ్యాపకురాలు ఆచార్య అనురాధ, సోషియాలజీ అధ్యాపకురాలు డాక్టర్ కుసుమ, లా విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

ఎస్వీయూనివర్శిటీలో

ఎమ్మెల్యే ఇంట్లో చిరు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రముఖ హీరో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సంబరాలను తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా బుధవారం సాయంత్రం తిరుపతికి విచ్చేసిన విషయం విధితమే. స్వామివారి దర్శనం అనంతరం తిరుపతిలోని కేటీ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే నివాసానికి మెగాస్టార్ చిరంజీవి ఆయన సతీమణి సురేఖ కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. చిరంజీవి కుటుంబానికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీ కేకును చిరంజీవి దంపతులు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటిలో తేనేటి విందును స్వీకరించారు. అనంతరం చిరంజీవి కుటుంబ సభ్యులు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకొని హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆరణి మదన్, ఆరణి జగన్, ఆరణి శివకుమార్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేపు అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పట్టణంలోని కేసీసీ క్రికెట్ నెట్స్‌లో ఈనెల 24వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్ల ఎంపిక జరుగుతుందని కేసీసీ నెట్స్ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ (కన్న), గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో శ్రీకాళహస్తి రూరల్, అర్బన్, తొట్టంబేడు, కేవీబీపురం, ఏర్పేడు మండలాలకు చెందిన క్రికెట్ క్రీడాకారులు పాల్గొనచ్చని సూచించారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీ.విజయ్ కుమార్ ఆదేశాలానుసారం నిర్వహిస్తున్న ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం, క్రికెట్ కిట్, తెల్లని దుస్తులతో రావాలని సూచించారు. వివరాలకు 83415 40009, 99496 65350 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జిమ్ సెంటర్ ప్రారంభం

జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులో ఏర్పాటు చేసిన వెంకట్ ఫిటెనెస్ జిమ్ సెంటర్‌ను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ గురువారం ప్రారంభించారు. జిమ్ సెంటర్లో వసతులను పరిశీలించి జిమ్ సెంటర్ నిర్వాహకులను అభినందించారు. జిమ్ సెంటర్లో మహిళ లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, ఇంపార్టెంట్ ఎక్విప్‌మెంట్ అందుబాటులోకి తీసుకొచ్చి శిక్షణ పొందిన మహిళలచే ప్రత్యేకంగా మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గూడూరు పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ ఫిట్‌నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్ టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వరరాజు, ఉమ్మడి వెంకటేశ్వర్లు, మధు యాదవ్, జిమ్ సెంటర్ నిర్వాహకులు వెంకటేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు వ్యాధి, కలుషిత నీరు ఆహారం ద్వారా వ్యాపించే వాంతులు, విరోచనాలు, కుష్టు వ్యాధి నివారణపై స్థానిక అక్షర ప్రైవేటు పాఠశాలలో వైద్యాధికారులు గురువారం అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డీఎన్ వెంకటేశులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల విసర్జన తరువాత ఆహారం తీసుకునే ముందు, చిన్న పిల్లలు ఆటలాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, ఫ్రైడే డ్రై డే పాటించి దోమలను అరికట్టాలని సూచించారు. ఇంటి ఆవరణలో వ్యర్థాలైన కప్పులు టైర్లు, కొబ్బరి చిప్పలు రోళ్లు పనికిరాని కుండలు, డబ్బాలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు కాచి చల్లార్చి తాగడం ద్వారా, వేడి, తాజా ఆహారం తీసుకోవడం ద్వారా విరోచనాలు, వాంతుల నుండి రక్షించుకోవచ్చని తెలిపారు.

బాలికలకు పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - కోట : కోట మండలంలోని స్థానిక అంగన్‌వాడీ సిడిపిఓ మునుకుమారి ఆధ్వర్యంలో కోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిషోర్ బాలికలకు 'బేటీ బచావో బేటీ బడావో' కార్యక్రమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిడిపిఓ మణికుమారి, సూపరవైజరు ఎ కృష్ణమ్మ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు వివాహాలు చేసుకోకూడదని విద్యార్థులకు వివరించారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ పోషికాహారం గురించి తెలిపారు. పిల్లలకు పలుకరాలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మమత, సుందరమ్మ, పెంచలమ్మ, యూన్సీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలోని రామగిరి, అడివి కండ్రిగ ఎంపిపి పాఠశాలలో చదువుతున్న 32 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గౌరి సమక్షంలో ఆలయ ఛైర్మన్ కేవీఎల్ వెంకటేశ్వర్లు, ఎల్ సెల్వం గురువారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఇదే గ్రామంలో పుట్టి పెరిగి నేడు తమ గ్రామంలో ఎంపిపి ప్రభుత్వ పాఠశాల పిల్లలకి గత ఆరు సంవత్సరాలుగా తమ వంతు సహాయసహకారాలతో విద్యార్థిని పుస్తకాలు అందించడం చాలా సంతోషంగా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోట ఎస్ఐను కలిసిన కార్తికేయ మినరల్ అధినేత

ప్రజాశక్తి -కోట : కోట ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె పవన్ కుమార్‌ను కోట మండలం విశ్వనాథపుర అగ్రహారానికి చెందిన కార్తికేయ మినరల్స్ అధినేత, సీనియర్ టిడిపి నాయకులు రాయపు సుబ్రహ్మణ్యం గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలవేసి, స్వీటు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పారదర్శక పాలనకు కృషి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శక పాలనకు కృషి చేస్తానని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజక వర్గంలో ప్రభుత్వ కార్యాలయాలలో ఎమ్మెల్యే పేరుతో ఎవరు వసూళ్లకు పాల్పడినా సహించేది లేదని నియోజక వర్గ ప్రజలంతా దీన్ని గ్రహించాలని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేసేందుకే వున్నాయని వారిని పదే పదే తిప్పించుకోవడం తగదని హితవు పలికారు. పుత్తూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రికార్డు రూమ్ శిథిలావస్థకు చేరుకోవడంతో కలెక్టర్ ద్వారా నూతన భవనాన్ని మంజూరు చేయిస్తానని అధికారులు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ యోగానంద్, తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలి..

వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్ : ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలని కోరుతూ మహిళా వర్సిటీలో గురువారం అవగాహనను కల్పించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 5, ర్యాగింగ్ వీక్ లాంగ్ సెలబ్రేషన్స్ సందర్భంగా అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా, ఎస్ఎ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఫ్యాకల్టీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఫైవ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆముదవల్లి ఆచార్యులు సునీత, రేణుక, శిరీష ,ప్రసన్న, అనురాధ, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యారిస్‌కు వేలాయుధం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ఒలింపిక్స్ క్రీడల వేదికైన ప్యారిస్ కు పట్టణానికి చెందిన ప్రముఖ కలంకారీ కళాకారుడు, శిల్ప గురు అవార్డు గ్రహీత వేలాయుధం శ్రీనివాసులురెడ్డి పయనం కానున్నారు. అక్కడ నిర్వహించబోయే పారా ఒలింపిక్స్ క్రీడల సందర్భంగా సెప్టెంబర్ 5 నుంచి 9వ తేదీ వరకు పలు వేదికల్లో తమ హస్తకళా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఫ్రాన్స్ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వివిధ హస్త కళల్లో శిల్ప గురు అవార్డులు పొందిన కళాకారులను ప్యారిస్ కు పంపేందుకు భారత ప్రభుత్వం ఒప్పుకుంది. అలా ఎంపికైన శిల్ప గురు అవార్డు గ్రహీతల్లో దేశవ్యాప్తంగా ఐదు మాత్రమే ఉండగా, వీరిలో ఆంధ్ర రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక కళాకారుడిగా వేలాయుధం శ్రీనివాసులు రెడ్డి కావడం గమనార్హం.

అలిపిరి సీఐకి సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి అలిపిరి నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన సిఐ రామ్ కిషోర్ ని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొట్టె హేమంత్ మాట్లాడుతూ అలిపిరి పరిధిలో గంజాయి, బైక్ రైసింగ్లలను అరికట్టి విద్యార్థులకు మంచి మార్గంలో నడిచే విధంగా కృషి చేయాలని తెలిపారు. రాత్రి సమయాల్లో షాపులు తెరుచుకొని అధిక ధరలకు తినుబండారాలు, భోజనాలు, టీ లు అమ్ముతూ యాత్రికులను ఆర్థిక దోపిడీ చేస్తున్నటువంటి హోటళ్లపైన, షాపుల పైన చర్యలు తీసుకోవాలని నూతన సీఐ రామ్ కిషోర్‌ని కోరారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో లో ఉన్న ప్రాంతంలో రాత్రి సమయంలో నిఘా, భద్రతలను పెంచి అల్లరి మూకలను అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జానకిరామ్, జ్ఞానేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం: ఎస్ఐ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా క్షేమమే తమ ధ్యేయమని వరదయ్యపాళెం ఎస్ఐ కె ఆర్ మల్లికార్జున అన్నారు. వరదయ్యపాళెం ఎస్ఐగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కడప తాలుకా పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఆయనను సాధారణ బదిలీలలో భాగంగా ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మల్లికార్జున మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజా క్షేమమే తన మొదటి కర్తవ్యం అని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

అనుసంధానం లేని రోడ్లు

- పాలకుల నిర్లక్ష్యం- ప్రజలకు తీవ్ర ఇక్కట్లు

వర్షానికి గుంతలమయమైన వీధి రోడ్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీలోని పలు కాలనీలను అనుసంధానం చేస్తూ ప్రధాన రోడ్డు మార్గాలను నిర్మించారు. కానీ ప్రధాన మార్గానికి ఆనుకుని ఉన్న వీధి రోడ్లకు అనుసంధానం చేయడం పాలకులు విస్మరించారు. ఈ తప్పిదంతో ఏదైనా చిన్నపాటి వర్షం పడితే వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తూ రోడ్డుపక్కనే ఉన్న మట్టి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి పెద్ద గుంతలుగా ఏర్పడుతోంది. ఈ సమస్య ఎంతో కాలంగా ఉన్నా, గత పాలకులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించు కున్న పాపాన పోలేదు. 'అదిగో.. ఇదిగో..' అంటూ కాలం వెల్లదీస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపలేదు. ప్రధాన మార్గం మీదుగా వెళ్లే వీధి మార్గాలను అనుసంధానం స్థలాన్ని కాంక్రీట్ తో పూర్తి చేస్తామని హామీలు ఇచ్చారు..ఆ తర్వాత పట్టించుకోలేదని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బడి పిల్లలు వీధి నుండి ప్రధాన మార్గం మీదుగా మరో వీధిలోకి వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాల్లో పాఠశాలలకు పిల్లలను తీసుకెళ్లే వారి తల్లిదండ్రులు అనుసంధాన రోడ్డు మార్గాలు సరిలేక ప్రమాదాలకు గురై గాయాల పాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం హయాంలో బిటిఆర్ కాలనీ ఒకటో లైన్ నుండి తిరుమల నగర్ గ్రామ పంచాయతీ ప్రధాన రోడ్డు మార్గాన్ని కలుపుతూ సిసి రోడ్డు నిర్మించారు. సిసి రోడ్డు నిర్మించిన ఏడాదికి కల్వర్టు నిర్మాణం చేసి కల్వర్టు నుండి అనుసంధానంగా ముందు (తూర్పు నుండి పడమర వైపుగా) అలాగే విడిచి పెట్టడంతో కంకర తేలి అటుగా ప్రయాణిం చేవారు. పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూలు బస్సులు, వ్యాన్లు, స్కూలు ఆటోలు, ద్విచక్ర వాహనాలు రోజుకు వందల సంఖ్యలో ఈ రోడ్డుపై ప్రయాణిస్తు ఉంటాయి. ఈ క్రమంలో అనేకమార్లు కంకర తేలిన రోడ్డు మార్గంపై వాహనం వెళ్లేటప్పుడు అదుపు తప్పే దుస్థితి నెలకొంది.

గత పాలకులకు చెప్పినా..

గత వైసిపి హయాంలో వీధి రోడ్డుకు, ప్రధాన రోడ్డు మార్గానికి అనుసంధానంగా ఉన్న చిన్న భాగానికి కాంక్రీట్ వేయాలని కోరినా పట్టించుకోలేదని పాఠశాల నిర్వాహకులు, ప్రజలు వాపోతున్నారు.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, 2021లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో వైసిపికి చెందిన కార్యవర్గాలు ప్రస్తుతం పంచాయతీల్లో కొలువుదీరి పాలన కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వీధిలైట్లు, తాగునీటి బోర్లు, రోడ్ల మరమ్మతులు, చెత్తను శుభ్రం చేయకపోవడం ఇలా అనేక సమస్యలతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజా సమస్యలను సత్వరం పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్కూల్లో అగ్నిప్రమాదం

అగ్ని ప్రమాదం సంభవించిన స్కూలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి బైరాగి పట్టెడలోని ఓ ప్రైవేటు స్కూల్లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఓ ప్రైవేటు స్కూల్లో ఉదయం 9.30 గంటల సమయంలో మూడో అంతస్తులోని ఓ గదిలో మంటలు వ్యాపించాయి. అదే సమయంలో విద్యార్థులు క్రీడ మైదానంలో ప్రార్థన ముగించుకొని తరగతి గదిలోకి వెళుతున్నారు. మంటలు రావడాన్ని పసిగట్టిన స్కూల్ సిబ్బంది విద్యార్థులను అక్కడ నుంచి పక్కనున్న అపార్ట్‌మెంట్‌లోకి క్షేమంగా తరలించారు. స్కూలు యజమాన్యం సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకొని మంటలను అదుపు చేశారు. స్కూల్ మిద్దె పైన ఫర్నిచర్ వేచి ఉన్న గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, ఓ రెండు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. విషయం తెలుసు కున్న డిప్యూటీ డిఈఓ బాలాజీ నాయక్ ప్రమాదం జరిగిన స్కూల్ వద్దకు చేరుకుని అక్కడ పరిస్థితి లను పరిశీలించారు. ఎలా జరిగిం దన్న విషయం స్కూలు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారని తెలుసు కోవడంతో, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకో వాలని సూచించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న షిరిడీ సాయి అక్షయ సేవా సమితి నిర్వాహకులు

ప్రజాశక్తి - కోట: కోట మండలంలోని శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి ద్వారా దాతల దాతృత్వంతో సౌమ్య పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా శ్రీ షిరిడీ అక్షయ సాయి సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య మాట్లాడుతూ 2002 సంవత్సరం నుండి శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్టు గ్రామానికి చెందిన దేగా గిరి కుమార్తె సౌమ్య విద్యార్థినికి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు రావడంతో బిల్డింగ్ ఫీజు, వ్యాన్ ఫీజు నిమిత్తం తమ ట్రస్టును ఆశ్రయించారని, శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ద్వారా పదివేల రూపాయల చెక్కును అందించామని తెలిపారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు అల్లం రమణయ్య, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు పుణేంద్ర నాగూర్ రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు కొండూరు వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామ సభలను విజయవంతం చేయండి: ఎంపిడివో

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: కేవిబిపురం మండలంలో 23వతేదీ గ్రామ పంచాయతీలలో సభలు సచివాలయాల్లో కాకుండా బయట నిర్వహించి, సభలో తీసుకునే తీర్మానాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామ సభకు ప్రతి శాఖ అధికారులు హాజరు కావాలని లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈవోపిఆర్‌డి దయాసాగర్ పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: పంచాయతీల్లో అభివృద్ధి పనులను ఎంపిక చేసేందుకు శుక్రవారం నిర్వహించనున్న గ్రామ సభకు ఎమ్మెల్యే పులివర్తి నాని రానున్నారని ఎంపిడివో సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎంపిక చేసేందుకు ఆయా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి పంచాయతీ తీర్మానం చేయనున్నారు. పంచాయతీలలో తమ గ్రామ అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజి, మౌలిక వసతులు కల్పనకు అవసరమైన పనులను అధికారులు, కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు అన్నీ కేడర్ నాయకులు, కార్యకర్తలు హాజరై అభివృద్ధి పనులు ప్రతిపాదించి తీర్మానం చేయనున్నారు. తీర్మానం చేసిన పనుల జాబితాను కలెక్టర్‌కు పంపి పరిపాలన అనుమతి పొందిన వెంటనే ఆయా పనులకు కేటాయించిన నిధులతో పనులు ప్రారంభించనున్నారు. ఈసభలకు ఎమ్మెల్యే పులివర్తి నాని సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో త్రివిక్రమ రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయం బయట సభ నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సభకు హాజరు కావాలని సూచించారు. ఈ ప్రత్యేక గ్రామ సభలు సర్పంచి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, అధికారులు సభకు హాజరు కాకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి రాజశేఖర్ పాల్గొన్నారు.

సత్యవేడు: నేడు నిర్వహించనున్న గ్రామ సభలకు అధికారులందరూ అందరూ హాజరు కావాలని అభివృద్ధి పనుల ఎంపికలో కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం అన్నీ పంచాయతీలలో నిర్వహించే గ్రామ సభలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయా పంచాయితీ లలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సభలో తీర్మానించాలన్నారు. తీర్మానంలో అంశాలను కలెక్టర్‌కు పంపి పరిపాలన అనుమతి నిధులతో పనులు ప్రారంభించాలన్నారు. పనులు ఎంపిక చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం అన్నారు.

గూడూరు టౌన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ బాధ్యత వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభల్లో జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొని సభలను విజయవంతం చేయాలని జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో నిర్వహించే గ్రామ సభలో జనసేన నాయకులు, టీడీపీ, బీజేపీ శ్రేణులతో కలిసి సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు అక్బర్ కుమార్, క్రాంతి, గోపాల్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : నేడు జరిగే గ్రామ సభల్లో అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గూడూరు మండల ప్రజ పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులు గ్రామాల ద్వారా అవసరమైన పనులను గుర్తించి , పనులకు ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపిడివో వెంకటేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో 'నేను మీకు తెలుసా?'పై అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వే ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో 'నేను మీకు తెలుసా?' అనే అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్లను సేవలను విద్యార్థినులకు తెలిపేందుకు ఆర్‌పిఎఫ్ సిఐ సికె మధుసూదన్, ఫైర్ డిపార్టుమెంట్ మునిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంట్లో గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదం, నీళ్లలో ప్రమాదం జరిగినప్పుడు మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో లైవ్ డెమోతో తెలిపారు. రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మాట్లాడుతూ విద్యార్థినులు డ్రగ్స్‌కు బానిసలు అయినందు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మానస హాస్పిటల్ నుండి సైక్రియాటిస్ట్ డాక్టర్ కిషోర్ కుమార్, సైబర్ క్రైమ్ నుండి సీనియర్ కానిస్టేబుల్ సి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలలో సైబర్ నేరాలు మోసాల బారి నుండి ఎక్కడికీ వెళ్లకుండా ఒక్క ఫోన్ కాల్‌తో 'మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి?' తెలిపారు. 100, 108, 104, 181, 112, 101,1098,139,1930 ఈ టోల్ ఫ్రీ నెంబర్లకు సంబంధించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఎం విద్యావతి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ యువశ్రీ, డాక్టర్ మాధురి, డాక్టర్ సుజాత, వజీహాభాను, డాక్టర్ భార్గవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధి గ్రామ సభలను విధిగా నిర్వహించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి- రామచంద్రపురం: గ్రామాలలో అభివృద్ధి పనులను గుర్తించేందుకు ఉపాధి హామీ గ్రామ సభలను విధిగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వలసల నివారణకు, ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పన లక్ష్యంగా పనులను ఎంపిక చేయాలన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు, కొత్తరహదారుల నిర్మాణం, శ్మశాన వాటికలు ఏర్పాటు వంటి పనులను గుర్తించాలన్నారు. గ్రామసభలో షామియానా, కుర్చీలు, తాగునీరు, మైక్ సెట్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సభలో ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు గుర్తించిన పనులకు గ్రామ పంచా యతీ తీర్మానాన్ని తప్పని సరిగా తీసుకోవాలన్నారు. గ్రామ సభలు చేసిన తీర్మానాల నకలును ఎంపీడీవో కార్యాలయానికి చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి దేవిక, ఉపాధి హామీ ఎపిఓ హంసవయ్యని, జేఈఈ మమత, హౌసింగ్ ఏఈ మార్కండేయనాయుడు, పి ఆర్ ఏ ఈ రాజ మస్తాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్ రాజు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పిలకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బదిలీపై వెళుతున్న జిల్లా అదనపు ఎస్పీలు కులశేఖర్, విమల కుమారికి జిల్లా పోలీసులు ఘనమైన ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ అతిథిగృహం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీడ్కోలు కార్యక్రమానికి విచ్చేసిన ఎస్పి ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణ, నేర నియంత్రణకు ప్రతి రోజూ కొత్త సవాళ్లతో కూడుకుని వుంటుందని ఇందుకు తమ వంతు బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకుని వచ్చారన్నారు. హోంగార్డ్ నుండి ఉన్నతాధికారి వరకూ అందరికీ సమూచిత స్థానాన్ని ఇచ్చి, ప్రతి ఒక్కరితో స్నేహభావంతో మాట్లాడి వారిలో మెరుగైన ఫలితాలను పొందారన్నారు. ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం కోసం పోలీసు వ్యవస్థ ఎంతో కీలకం.. అని గుర్తించి తాము పని చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగంతో పని చేయించి, పోలీస్ అధికారులకు ఆదర్శవంతంగా నిలిచారని ప్రశంసించారు. బదిలీపై వెళుతున్న అదనపు ఎస్పీలు మాట్లాడుతూ మాకు ఇక్కడ పనిచేయడం గొప్ప వరమని పోలీస్ శాఖ అండతో ఇన్ని రోజులు ఇక్కడ సమర్ధవంతంగా విధులు నిర్వహించడం గొప్ప అనుభూతి అని భావోద్వేగంతో అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణ రావు, రాజేంద్ర, శ్రీనివాసరావు, జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొని ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రొఫెసర్ చలిచీమ లపల్లి కులాల జయశంకర్ (ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్)కు అరుదైన ఎర్త్‌ల పరి శోధన, అభివృద్ధి, అప్లికేషన్‌ల రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గౌరవార్థం రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆర్ఈఏఐ లైఫ్‌టైమ్ అచీవ్ మెంట్ అవార్డుకు మరో ప్రతిష్టాత్మకమైన గుర్తింపు లభించింది. ఈ నెల 21న తిరువనంతపురంలో జరిగిన రేర్ ఎర్త్స్ సైన్స్ అండ్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సు -2024, మెరిసే ప్రారంభ సెషన్‌లో ఈ అవార్డును ఆయన స్వీకరించారు. ఆర్ఈఏఐ అధ్యక్షుడు దీపేంద్ర సింగ్, ఐఆర్ఈఎల్ (ఇండియా) లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంపిఎల్ రెడ్డి, లేజర్‌లు, ఆప్టికల్ ఫైబర్ యాంప్లిఫైయర్‌లు, సెన్సార్‌లు, బయోలేబుల్‌లు, డబ్ల్యూ-ఎల్ఈడీల వంటి వివిధ అప్లికేషన్‌ల కోసం అరుదైన ఎర్త్-డోప్డ్ ఆప్టికల్ క్వాలిటీ గ్లాసెస్, నానో-గ్లాస్ సిరామిక్స్, నానోక్రిస్టలైన్ మెటీరియల్‌ల తయారీ, క్యారెక్టరైజేషన్, ఆప్టి మైజేషన్‌పై అతను అద్భుతమైన కృషి చేశాడు. ఈ సందర్భంగా ఆర్ఈఏఐ అసోషియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పి రెడ్డి, ఎస్‌వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సిబ్బంది ప్రొఫెసర్ బి దేవప్రసాద్ రాజుతో సహా ఆయన అద్వితీయ విజయాన్ని అందుకున్నారు.

క్రైం న్యూస్

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లరు ఒకరిని అరెస్టు చేసి వారి నుంచి 13 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్ ఫోర్సు ఎస్పీ కె.శ్రీనివాస్ నేతృత్వంలో సానిపాయ బేస్ క్యాంపు నుంచి ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బుధవారం కూంబింగ్ చేపట్టారన్నారు. వీరు ఎద్దుల కోన రాస్తా మీదుగా కొండూరు గ్రామం చేరుకుని, చిట్వేల్ రేంజి పెంగలూరు మండలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించగా గురువారం తెల్లవారు జామున చక్రంపేట వద్ద ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ మీద కూర్చుని మాట్లాడుకుంటూ కనిపించారన్నారు. వారిని సమీపిస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశారని, వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడ్డ వ్యక్తి కోడూరు టౌన్ పగడాలపల్లికి చెందిన తుపాకుల హరినాథ్ (37)గా గుర్తించామన్నారు. ఇతన్ని విచారించగా దాచి ఉంచిన 13 ఎర్రచందనం దుంగల డంప్ ను చూపించాడన్నారు. ఈ కేసును సీఐ సురేష్ కుమార్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పోలీసుల ఎదుటే ఫిర్యాదుదారుల దాడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఇంటి వద్ద చోటు చేసుకున్న చిన్న గొడవకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇద్దరు ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌లోని పోలీసులు ఎదుట ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. పేరూరులోని ఎదురెదురుగా ఉన్న రెండు కుటుంబాలకు చెందిన మహిళలు నీటి కుళాయి వద్ద వచ్చిన గొడవ కారణంగా బూతులు తిట్టుకున్నారు. ఇది రానురాను చిలికి చిలికి గాలి వానలా మారి భర్తల వరకు వెళ్లి గొడవలకు దారి తీసింది. దీంతో రెండు కుటుంబాలకు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గురువారం సాయంత్రం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. సిఐ, ఎస్ఐ ఎదుట ఫిర్యాదు చేస్తుండగా ఫిర్యాదు దారులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. దీంతో కోపోద్రిక్తులై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గాయాలయ్యేలా ఒకరిపై ఒకరు పిడి గుద్దులు గుద్దుకున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. చివరకు పోలీస్ సిబ్బంది స్పందించి, దాడి చేసుకున్న ఇరువురిని అదుపులోకి తీసుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

ఎర్రచందనం కారును పట్టుకున్న యువకులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి): కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేసుకొని వేగంగా వస్తున్న కారు చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పసిగట్టి పోలీసులకు పట్టించారు. గురువారం రాత్రి చిరంజీవి జన్మదిన వేడుకల్లో అభిమానులు గుంపులుగా ఉండడంతో ఎర్రచందనం కారు వేగం తగ్గింది. వెంటనే కారులో ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లను చూసి కారును తనిఖీ చేశారు. కారులో ఎర్రచందనం దుంగలు ఉండడంతో యువకులు స్మగ్లర్లతో వాగ్వివాదం చేస్తుండగా కారును వెంబడిస్తూ వస్తున్న తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసులు సమయానికి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎర్రచందనం దుంగలతో పాటు స్మగ్లర్లను, కారును, కారు డ్రైవరును పోలీసులకు చిరు అభిమానులు అప్పగించారు. పోలీసులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సిఐ తిమ్మయ్య బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ తిమ్మయ్య

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చి నాయు డు కండ్రిగ సిఐగా ఎం తిమ్మయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కడప రూరల్ రూరల్ సిఐగా పనిచేస్తూ బుచ్చి నాయుడు కండ్రిక సిఐగా బదిలీ అయ్యారు. గతంలో శ్రీకాళహస్తి ఒన్‌టౌన్ ఎస్ఐగా ఎస్ఐగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల కోసం సేవ చేస్తానని, నేరాల నియంత్ర ణకు, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా చర్యలు తీసు కుంటామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి 69వ పుట్టినరోజు జరుపుకోవడం చాలా సంతోషమని ఇలాంటి పుట్టిన రోజులు మళ్లీ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు నాగభూషణం, ప్రభు, రామకృష్ణంరాజు, మహమ్మద్ అలీ, మని పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెళ్లి మండపం, ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో కేకులు కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. చిరంజీవి పుట్టినరోజున పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, తోట గణేష్ పాల్గొన్నారు.

రామచంద్రపురం(చంద్రగిరి): మెగాస్టార్ డాక్టర్ కె. చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆర్ మునిరత్నం రాయల్, ఈశ్వర్ రాయల్, గోపి, బెల్లంకొండ రమేష్ ల ఆధ్వర్యంలో బాణాసంచాల పేల్చి, కేక్ కట్ చేసి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షులు రాజ రాయల్, బెల్లంకొండ రమేష్, చెరుకుల నీలాద్రి, మునిరత్నం రాయల్, మురళీ రెడ్డి, గోపి రాయల్, నవీన్ కుమార్ రెడ్డి, బుజ్జి, ఈశ్వర్ రాయల్, దండు లక్ష్మీపతి పాల్గొన్నారు.

చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వినుత

చిరంజీవిని సన్మానించిన వినుత

శ్రీకాళహస్తి: మాజీ రాజ్యసభ సభ్యులు, అగ్ర నటుడు మెగాస్టార్ చిరంజీవికి జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెంకన్న దర్శనార్థం తిరుమలకు చిరంజీవి వచ్చారు. ఈ సందర్భంగా వినుత దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంత రం రేణిగుంట విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు.

పెళ్లి కానుక పంపిణీ

డాక్టర్ కె చిరంజీవి జన్మదిన సందర్భంగా ఈశ్వర్ ఏజెన్సీ అధినేత రామినేని మునిరత్నం రాయల్ డోర్నకంబాల పంచాయతీ నాగల చెరువు ఎస్టి కాలనీలోని నూతన దంపతులకు బంగారు మంగళ సూత్రం, వెండి కాళ్ల మెట్లు, నూతన వస్త్రాలు, పూలు పండ్లు, స్వీట్లను పెళ్లి కానుకగా కుటుంబ సభ్యులకు అందించారు.

శ్రీకాళహస్తి రూరల్ సీఐగా ఎం రవి నాయక్

బాధ్యతలు స్వీకరిస్తున్న రవినాయక్

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ : శ్రీకాళహస్తి రూరల్ సీఐగా ఎం రవి నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి సిఐడి విభాగంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. రూరల్ సర్కిల్లో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని నూతన సిఐ తెలిపారు. స్టేషన్ సిబ్బంది నూతన సిఐకి స్వాగతం పలికారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION): PUTTUR
I.A.No. 100 OF 2024
O.S.No. 151 OF 2017

Between
Mungilipattu Radha
...Petitioner/3rd Defendant
And
Kotakondla Ramesh (died)
...Respondent/Plaintiff
Kotakondla Sreeramulu (D1)
Kotakondla Balaram @ Balaramaiah (D2)
...Respondents/Defendants
To
Kotakondla Balaram @ Balaramaiah. S/o.late K.Ramachandraiah, Hindu. Employee, Vaddi Indlu village, Nesanuru post, Puttur Mandal, Tirupati district.

NOTICE TO THE RESPONDENT/ DEFENDANT No.2

Please take Notice that the above Petition filed by the petitioner/ 3 defendant against you on the file of the Hon'ble Civil Judge (Senior Division), Puttur. The said case is posted for your notice on 10-09-2024. If you failed to appear in person or through an Advocate on 10-09-2024 at 10.30 AM before the said Court, thus the matter will be decided as ex parte.
This is the order of the Hon'ble Court.

SRI KILARI CHANDRASEKHAR
ADVOCATE FOR PETITIONER/3rd DEFENDANT, PUTTUR